సంక్షేమ.. అడుగులు

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాలకు గ్రహణం వీడనుంది. పాత భవనాలు, అద్దెకున్నచోట నూతన నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విద్యార్థుల సమస్యలపై గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు. నూతన నిర్మాణానికి పీఎం అజయ్ పథకం కింద సమగ్ర నివేదికను కేంద్రానికి నివేదించారు.

తొలి విడతలో చంద్రగిరి

రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా 16 జిల్లాల్లో నూతన భవన నిర్మాణాలకు వసతిగృహాలను ఎంపిక చేసింది. ఇందులో జిల్లా పరిధిలోని చంద్రగిరి బాలుర వసతిగృహం ఎంపికైంది. ఇక్కడ ప్రైవేటు భవనంలో కళాశాల విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఇక్కడే స్థలం, నిర్మాణం కోసం రూ.3 కోట్లు వెచ్చించనున్నారు. రెండో విడతలో జిల్లాలోని మరిన్ని వసతిగృహాలను ఎంపికచేసి నూతన భవనాలు నిర్మించనున్నారు.



చంద్రగిరిలో అద్దె భవనంలోని వసతిగృహం

జిల్లాలోని వసతిగృహాలు ప్రభుత్వ 59 | ప్రైవేట్ 3 | మొత్తం 62 | విద్యార్థులు 5,300

శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టికెట్లు లేకుండా ఆదివారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. శనివారం శ్రీవారిని 80,741 మంది దర్శించుకున్నారు. రూ.3.45 కోట్ల హుండీ కానుకలు లభించాయి.



ఈనాడు తిరుపతి

సోమవారం అక్టోబరు 21, 2024



అనర్హుల ఏరివేత.. అర్హులకు భరోసా

◆ కొత్త పింఛన్లకు వేలమంది నిరీక్షణ ◆ త్వరలో జారీకానున్న మార్గదర్శకాలు

ఎస్.ఆర్.పురం మండలం, మాగుంట పంచాయతీకి చెందిన మాలిని(32) దివ్యాంగ పింఛను రూ.6 వేలు తీసుకుంటోంది. పింఛను ఐడీ 11000153553. ఆమెకు ఎడమ చేయి విరిగినా ఏమీ లేదు. నిబంధనల ప్రకారం ఆమెకు ఐదుశాతం వైకల్యం ఉన్నట్లు సదరం ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉండగా 46% ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. స్థానిక ఎంపీడీవో ఈనెల పింఛను ఆపేసి ఉన్నతాధికారుల పరిశీలనకు పంపారు. దీంతో ఆమె కలెక్టరును కలిసి తనకు అర్హత ఉన్నా ఆపేశారని ఫిర్యాదు చేశారు. అయితే ఆమెకు దివ్యాంగురాలి పింఛను తీసుకునే అర్హత లేదని అధికారులు స్పష్టం చేశారు.

చంద్రగిరి మండలంలో పెద్దఎత్తున బోగస్ పింఛన్లను గతంలో గుర్తించారు. ఇక్కడ సర్పంచు దంపతులు సైతం పింఛను పొందడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. వీటి అర్హత పరిశీలనకుగాను వైద్యాధికారులకు నివేదించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు చర్యలుండే వీలుంది.

- న్యూస్‌టుడే, చిత్తూరు పంచాయతీ, తిరుపతి (భవానీనగర్)

రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో సామాజిక పింఛన్లదే అగ్రస్థానం. వైకాపా హయాంలో తగిన అర్హతలు ఉండి ఏళ్లతరబడి మంజూరుకాని వారంతా ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ విధానాలతో అనర్హులకూ పెద్దఎత్తున పింఛన్లు అందుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో అనర్హులను గుర్తించి వారిస్థానంలో అర్హులకు ఇచ్చేందుకు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తున్నారు. జిల్లాలో మాత్రం ఇంకా ఈ ప్రక్రియ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం నుంచి కొత్త పింఛన్ల మంజూరుకు ఎప్పుడెప్పుడు మార్గదర్శకాలు విడుదలవుతాయా అని దరఖాస్తుదారులు నిరీక్షిస్తున్నారు.

◆ తిరుపతి జిల్లాలో 31,279 మంది దివ్యాంగులు నెలనెలా రూ.6 వేలు తీసుకుంటున్నారు. వీరిలో 20 శాతం మంది అంటే ఏడువేల పైగా అనర్హులు ఉన్నట్లు అధికారుల అంచనా.

◆ వృద్ధాప్యంలో మంచంలో ఉన్నవారు పింఛను తీసుకుంటుండగా, వీరిలో 25 శాతం మందికి పైగా నయమైనా కొనసాగిస్తున్నట్లు సమాచారం.

◆ వివిధ విభాగాల్లో 30-35 వేలమందికి పైగా అనర్హులకు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

◆ ఒంటరి మహిళ విభాగంలోనూ అనర్హులకు లబ్ధి చేకూర్చినట్లు గ్రామాల్లో ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఆరంచెల పేరిట

తెదేపా, జనసేన, భాజపా సానుభూతిపరుల పింఛన్లను ఆరంచెల తనిఖీ పేరుతో గతంలో పెద్దఎత్తున తొలగించారు. మరికొందరికి అర్హత ఉన్నా ఆధార్ కార్డుల్లో వయసు నమోదు, ఇతర అంశాల్లో పొరపాట్ల కారణంగా పొందలేకపోయారు.

50 ఏళ్లు దాటిన వారిలో ఆశలు

కొత్తవాటి కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తిరుపతి జిల్లాలోనూ పెద్దఎత్తున అర్హులు కలెక్టరేట్‌కు వస్తున్నారు. అనర్హులను రద్దుచేస్తే, అర్హులైన వారందరికీ మంజూరు చేసే అవకాశం ఉంటుంది. ఎన్నికల హామీ మేరకు 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛను మంజూరు చేస్తారని ఆశగా ఉండగా, మార్గదర్శకాలు వచ్చాకే స్వీకరిస్తామని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు.

అనర్హులుంటే చర్యలు తీసుకుంటాం

జిల్లా పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో అనర్హులుంటే చర్యలు తీసుకుంటాం. గతంలో వచ్చిన వాటిపై విచారణ చేపట్టాం. నూతన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. కొత్తగా దరఖాస్తుల స్వీకరణకు ఆన్‌లైన్ వెసులుబాటు లేదు. గ్రీవెన్స్‌లో అర్జీలు ఇస్తున్నారు.

- శోభన్‌బాబు, పీడీ, డీఆర్‌డీఏ

జిల్లాలో మొత్తం పింఛన్లు 2,66,342

వృద్ధాప్య	దివ్యాంగులు	వితంతు	ఒంటరి మహిళలు	ఇతరులు
1,34,844	31,279	70,476	6336	23,407



తిరుపతి పద్మావతిపురంలోని హైస్కూల్ ప్లస్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు లేక గ్రంథాలయంలోనే మొదటి సంవత్సరం విద్యార్థినులు

అయోమయంలో ఇంటర్ చదువులు

హైస్కూల్ ప్లస్.. ప్రవేశాలు మైనస్

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: హైస్కూల్ ప్లస్ కళాశాలల ప్రతిష్ఠ ప్రశ్నార్థకంగా మారింది. రెండేళ్ల కిందట వాటిని ఆర్భాటంగా ప్రారంభించగా నేటికీ బాలారిష్టాలు దాటలేకపోతున్నాయి. ప్రస్తుతం పదిచోట్ల ప్రవేశాలు లేకపోగా ఉన్నవారూ వెళ్లిపోతున్నారు. ఇక్కడ టీచర్లు ఇవ్వడం లేదన్న ఆరోపణలున్నాయి.

■ క్షేత్రస్థాయిలో ఇలా..

వాకాడు బాలికల హైస్కూల్ ప్లస్‌లో ప్రవేశాలు జరగలేదు. కోటలో ప్రథమ సంవత్సరంలో 98 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. గూడూరులో 13, 18 మంది బాలికలు చొప్పున ఉన్నారు. బాలాయపల్లి, పెళ్లకూరులో ప్రవేశాలు పూర్తిగా లేవు. రామచంద్రాపురం బాలికల పాఠశాలలో 8, 17 మంది చొప్పున ఉన్నారు. బీఎన్‌కండ్రిగలో కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో ఎవరూ చేరలేదు. చిల్లకూరులో బాలురు 13 మంది, బాలికలు 8 మంది మాత్రమే ఉన్నారు. నారాయణవనం మండలం పాలమంగళంలో మొదటి సంవత్సరంలో ముగ్గురే చేరగా డక్కిలి, తొట్టంబేడు, ఆర్సీపురంలో ఈ ఏడాది ప్రవేశాలు జరగలేదు.

■ అర్బన్‌లోనూ ఆదరణ కరవే..

పద్మావతిపురంలోని హైస్కూల్ ప్లస్ పరిశీలిస్తే.. 2022లో ఇక్కడ తరగతులు ప్రారంభించగా 17, 13 మంది చొప్పున చదువుతున్నారు. ఇక్కడ బైపీసీ కోర్సు మాత్రమే అందుబాటులో ఉంది. విద్యార్థులకు సరిపడా గదులు లేవు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హైస్కూల్ కోసం ఉపయోగించే సైన్స్ గదిలో.. మొదటి ఏడాది విద్యార్థులు గ్రంథాలయ గదిలో కూర్చుంటున్నారు. గత ఏడాది ఫలితాలు పరిశీలిస్తే 38.4%, 40% చొప్పున నమోదయ్యాయి.

■ ఉపాధ్యాయులపైనే భారం

పాఠశాల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లను ఇంటర్ బోధనకు వినియోగిస్తున్నారు. వీరు బైపీసీ విద్యార్థులతో పాటు 9, 10 తరగతిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. ఒక ఇంక్రిమెంట్ మాత్రమే ఇచ్చినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో మొత్తం 39 హైస్కూల్ ప్లస్‌లు ఉన్నాయి. గత ఏడాది వరకు 25 ఉండగా ఈ విద్యా సంవత్సరం అదనంగా 14 చోట్ల ప్రారంభించారు. వాటిలో ఏకంగా పదిచోట్ల ప్రవేశాలు లేవు.

● జిల్లా వ్యాప్తంగా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు కలిపి బాలురు 101 మంది, బాలికలు 802 మంది ఉన్నారు. ద్వితీయ సంవత్సరంలో బాలికలు 505 మంది ఉన్నారు.

అదే తీరు.. అవినీతి ప్రభ

● మారని రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తీరు

● కథ నడిపిస్తున్న దస్తావేజు లేఖరులు



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రేణిగుంట, న్యూస్‌టుడే: అక్రమాలకు, విమర్శలకు కేంద్రమైన స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తీరు మారడం లేదు. ఇక్కడ పనిచేసిన సబ్‌రిజిస్ట్రార్లు ఇద్దరూ వరుసగా వేటుకు గురయ్యారు. సిబ్బంది చేతివాటం.. రిజిస్ట్రేషన్‌కు ఇంత చెల్లించాల్సిందేనన్న లేఖరుల డిమాండ్లు సరేసరి. వైకాపా హయాంలో పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన కార్యాలయంలో నేటికీ అదే పంథా కొనసాగడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తిరుపతికి సమీపంలో ఉండటంతో పాటు తిరుచానూరు, మంగళం తదితర ప్రాంతాల్లోని విలువైన భూములకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. వైకాపా అధికారంలోకి వచ్చాక కార్యాలయం ఓ వెలుగు వెలిగింది. నేతల భూములకు లోపాయికారిగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూనే ప్రజల నుంచి బహిరంగ వసూళ్లు కొనసాగించారు. ఇలా ఐదేళ్లలో జిల్లాలోనే అవినీతిలో మొదటి స్థానంలో చేరింది. అక్రమ రిజిస్ట్రేషన్లు, వసూళ్లపై ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో అతికష్టంమీద ఉన్నతాధికారులు కార్యాలయంపై దృష్టి సారించారు. ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లపై వేటు వేశారు. ఐదు నెలలుగా ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్ లేరు. ఇన్‌ఛార్జిలతో పాలన సాగిస్తున్నా వారు ఎక్కడా తగ్గడం లేదని స్థానికంగా విమర్శలు వస్తున్నాయి.

నెలకు రూ.2 కోట్ల ఆదాయం

● ఇక్కడ రిజిస్ట్రేషన్ కోసమని లేఖరులను కలిస్తే ఎంత ముట్టజెప్పాలో ముందే చెప్పేస్తున్నారు. ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు అంకణానికి రూ.500 నుంచి రూ.1000 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. వ్యవసాయ భూమి ఎకరా లోపు ఒకధర అంతకన్నా ఎక్కువైతే మరో ధరను నిర్ణయిస్తారు. ప్రస్తుతం కార్యాలయంలో గ్రూపులుగా మారి వసూళ్లకు పాల్పడుతున్నారు.

● కార్యాలయం నుంచి ప్రభుత్వానికి నెలకు రూ.2 కోట్ల ఆదాయానికి తగ్గదు. భూముల రిజిస్ట్రేషన్ల నుంచే ఇంత వస్తోంది. నెలలో కొన్ని రోజుల్లో రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు ఆదాయం ఉంటోంది. రోజూ 30 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయి. మార్ట్‌గేజ్ ద్వారా నెలకు మరో రూ.10 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. రైటర్లు ఒక్కో డాక్యుమెంట్‌పై రూ.5 వేల ఫీజు, కమిషన్ రూ.30 వేలకు తక్కువ తీసుకోవడం లేదు. కార్యాలయ సిబ్బందికి అంతే స్థాయిలో వెళ్తుంటాయి. ఈలెక్కన ప్రభుత్వ ఆదాయం రూ.3 కోట్లు ఉంటే.. కమిషన్, లంచాల వసూళ్లు మరో రూ.2 కోట్ల వరకు ఉంటాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు

కార్యాలయంలో సిబ్బంది పనితీరు గురించి నాదృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్

నేటి నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మొదటి రోజు స్మృతి పరేడ్.. రెండో రోజు నుంచి 30వ తేదీ వరకు అమరవీరుల కుటుంబ సభ్యులను పరామర్శించనున్నట్లు తెలిపారు. ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు వ్యాసరచన, బృంద చర్చల పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. తర్వాత రెండు రోజులపాటు ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్, 28వ తేదీ వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. తర్వాత సెమినార్లు, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. చివరి రోజు జాతీయ ఐక్యత పరుగు పందెం నిర్వహిస్తామని చెప్పారు. ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులు ఇస్తామని ప్రకటించారు.



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

టెట్‌కు 1,787 మంది హాజరు

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఏడు కేంద్రాల్లో జరిగిన టెట్‌కు 1,787 మంది హాజరయ్యారు. ఉదయం 1,026 మందికి గాను 887 మంది, మధ్యాహ్నం 1,024 మందికి గాను 900 మంది హాజరై పరీక్ష రాశారు. సోమవారంతో పరీక్షలు ముగియనున్నాయి.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి(కలెక్టరేట్), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం పది గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు అందరూ తప్పకుండా హాజరుకావాలన్నారు. అర్జీదారులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



స్వర్ణరథంపై విహరించిన ఏకదంతుడు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారు సిద్ధిబుద్ధి సమేతుడై స్వర్ణరథంపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతూ ఆదివారం రాత్రి భక్తులను కటాక్షించారు. ఉత్సవ మూర్తులకు ఆలయ అలంకార మండప వేదిక వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వర్ణరథంపై అధిష్ఠింపజేశారు. ఆపై గణేశ నామస్మరణల నడుమ ఊరేగించారు. ఆలయ ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

ఏడుకొండల దారిలో... ఇదేమి పరీక్ష గోవిందా..!

తిరునగరికి విచ్చేసే లక్షల మంది భక్తులు ఇక్కడ కాలుమోపాలంటేనే సంశయించాల్సి వస్తోంది. చినుకుజాడ పడగానే ఏపీఎస్‌ఆర్టీసీ ప్రాంగణం మురుగుకూపాన్ని తలపిస్తుండటంతో భక్తుల ఒళ్లు జలదరిస్తోంది. ఎంతో నిష్ఠతో ఇక్కడికి వస్తే ఆదిలోనే ఈ విషమపరీక్ష ఏమిటి గోవిందా.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లగేజీ, పిల్లాపాపలు, వృద్ధులను మురుగు దాటించడానికి తంటాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా ప్రాంగణం ఆధునికీకరణ పనులు పట్టాలెక్కించాలంటూ విన్నవిస్తున్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (ఆర్టీసీ)

తిరుపతి బస్ స్టేషన్ ఇలా..

మొత్తం బస్టాండ్లు: 4

ప్లాట్‌ఫాంలు : 64

బస్సుల రాకపోకలు : 2,700

ప్రయాణికుల రాకపోకలు: 1.15 లక్షలు

● చినుకుపడితే మురుగు కూపంగా ఆర్టీసీ బస్టాండు

● కలగా సముదాయం ఆధునికీకరణ

తిరుపతి పరిసరాల్లోని పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు, తిరుమల శ్రీవారి ఆలయ సందర్శనానికి వెళ్లే 60 శాతం మంది భక్తులు బస్సులనే ఆశ్రయిస్తుంటారు. తిరుపతి కేంద్రీయ బస్‌స్టేషన్ వేదికగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం గల ప్రాంగణం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో చినుకుపడితే చాలు చెరువును తలపిస్తోంది. ప్రాంగణంలో కురిసే వర్షపునీరు మొత్తం ఏడుకొండలు బస్టాండ్ వద్దకు చేరుతోంది. తిరుమల నుంచి వచ్చే బస్సులన్నీ ఇక్కడే నిలిపివేస్తుండగా పక్కనే ఉన్న శ్రీహరి, శ్రీనివాస బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు వర్షపునీటిలోనే నడిచి వెళ్లాల్సిన దుస్థితి.

పనుల్లో ఆలస్యం.. బస్‌స్టేషన్ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 15 అంతస్తులతో 100 ప్లాట్‌ఫామ్‌లు, షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్ థియేటర్లు, హెల్త్‌కేర్ తదితర వసతులతో ప్రణాళిక రూపొందించారు. రూ.500 కోట్ల టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడంతో సమస్యలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి.



ఇటీవల వర్షాల సమయంలో ఏడుకొండల బస్టాండు



అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పరిష్కారానికి చర్యలు

వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉంటున్నాం. నీరు నిలిచిన వెంటనే బయటకు పంపే చర్యలు తీసుకుంటున్నాం. వర్షం గంటలతరబడి పడే సమయంలోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అభివృద్ధి ప్రతిపాదనలు ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలో ఉన్నాయి.

- డి.రామచంద్ర నాయుడు, బస్‌స్టేషన్ ఏటీఎం

పట్టు రైతులకు సాగు ప్రోత్సాహం పెంపు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: నూతనంగా పట్టు సాగు చేపట్టే రైతులకు సాగు ప్రోత్సాహక నగదును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పట్టు పరిశ్రమ శాఖ జేడీ శోభారాణి తెలిపారు. కొత్తగా పట్టు సాగు చేపట్టిన జనరల్ రైతులకు ఎకరాకు అందజేసే ప్రోత్సాహక నగదును రూ.18,500 నుంచి రూ.22,750కు పెంచారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.22,500 నుంచి రూ.27,500కు పెంచారని చెప్పారు. జిల్లాలో ఈ ఏడాది పట్టు సాగు లక్ష్యం మూడువేల ఎకరాలని.. ఇప్పటికి 1500-1700 ఎకరాలు విస్తరించామన్నారు. సాగు ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వర్సిటీలు స్వయం సమృద్ధి సాధించాలి

కుప్పం గ్రామీణ : విశ్వవిద్యాలయాలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉపకులపతి దొరస్వామి, కడ ప్రాజెక్ట్ అధికారి వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్.మునిరత్నం, రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిల్లకూరులో ఉద్రిక్తత: ఇరువర్గాల ఘర్షణ

పెళ్లకూరు, న్యూస్‌టుడే: చిల్లకూరులో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. స్థానికుల వివరాల మేరకు.. ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ సత్యనారాయణ రెడ్డి ఇదే మండలంలోని పునబాకానికి చెందిన తెదేపా నేత లోకేశ్ నాయుడుకు రూ.3.50 లక్షలు బాకీ ఉన్నారు. ఈ విషయమై సత్యనారాయణరెడ్డిని ఆదివారం ప్రశ్నించడంతో లోకేశ్‌ను బెదిరించారు. ఆగ్రహించిన లోకేశ్ చిల్లకూరుకు చెందిన రాకేష్ మరికొందరు కలిసి సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లారు. వారు వస్తున్న విషయం గుర్తించిన ఆయన పరారై మరో ఇంట్లో దాక్కున్నారు. వారు ఇంటి గేటుకు తాళం వేయగా విషయం తెలుసుకున్న సత్యనారాయణరెడ్డి అనుచరులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఇదే సమయంలో రాకేష్‌రెడ్డి అనుచరులు చేరుకోవడంతో ఘర్షణ పడ్డారు. తెదేపా నాయకుడు చైతన్యరెడ్డి కారును పోలీసులు తీసుకొచ్చే క్రమంలో సీఐ జీపుపై స్థానిక వైకాపా కార్యకర్తలు రాళ్లు రువ్వి అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని చెదరగొట్టారు. ఎస్సై నాగరాజు ఘటనా స్థలానికి వెళ్లి ఆరా తీశారు. డీఎస్పీ చెంచుబాబు గ్రామంలో పర్యటించి శాంతిభద్రతలపై హెచ్చరికలు చేశారు.

ఉపసంహరణలకు బుజ్జగింపులు

తిరుపతి (బైరాగిపట్టెడ): తితిదే ఉద్యోగుల సహకార బ్యాంకు ఎన్నికలకు సంబంధించి ఆదివారం పరిశీలన అనంతరం 43 మంది నామపత్రాలు పక్కాగా ఉన్నట్లు ఎన్నికల అధికారి ఉమాపతి ప్రకటించారు. సోమవారం ఉపసంహరణల అనంతరం ఎంతమంది ఉంటారనేది తేలనుంది. కొందరు అభ్యర్థులను ఎన్నికల బరి నుంచి తప్పించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రాజకీయ పెద్దలు సైతం రంగప్రవేశం చేసి బుజ్జగింపులు చేస్తున్నట్లు సమాచారం.

అక్కడ మద్యం దుకాణం వద్దు

- పులికాట్ తీరప్రాంత గ్రామస్థుల మొర
- శాంతిభద్రతలకు భంగం
- షార్ యాజమాన్యం హెచ్చరికలు అమలయ్యేనా?

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట. ఇది అత్యంత సున్నితమైన ప్రాంతం. భద్రతపరంగా ఇప్పటికే కేంద్ర నిఘావర్గాలు ఎన్నో హెచ్చరికలు చేశాయి. ఇంతటి కీలకమైన కేంద్రానికి సమీపాన మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు పలువురు పావులు కదుపుతున్నారు. దీనిపై షార్ యాజమాన్యంతోపాటు స్థానిక గ్రామప్రజల నుంచి ఎప్పటి నుంచో వ్యతిరేకత వస్తోంది.

శ్రీహరికోటకు 3.5 కి.మీ. దూరాన, సూళ్లూరుపేట-శ్రీహరికోట రహదారిలో పులికాట్ సరస్సులో అటకానితిప్ప వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని షార్ యాజమాన్యంతోపాటు పులికాట్ తీరంలోని దామరాయి, కొరిడి, కడపత్ర పంచాయతీలకు చెందిన 18 గ్రామాల ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. దీనిపై షార్ యాజమాన్యం అప్పటో జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పెడచెవిన పెట్టారు. పర్యాటక ప్రాంతం పేరుతో గత ప్రభుత్వం అటకానితిప్పలో మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించింది.



ఎందుకు వద్దంటున్నారంటే..

అటకానితిప్పలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే.. ప్రశాంతతకు నిలయమైన పులికాట్ తీరంలోనూ, శ్రీహరికోట ప్రాంతంలో మందుబాబుల ఆగడాలు పెచ్చుమీరుతాయి. శ్రీహరికోటతోపాటు, పులికాట్ తీరంలోని గ్రామాల్లోనూ శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశముంది. వీటిని దృష్టిలో ఉంచుకుని మద్యం దుకాణం వద్దని ఎప్పటి నుంచో ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో రెండేళ్లపాటు దుకాణం లేదు. ఆ తర్వాత పర్యాటకం పేరుతో ఏర్పాటు చేసి విక్రయాలు సాగించారు. కూటమి ప్రభుత్వం కొత్త పాలసీలో భాగంగా ప్రభుత్వ మద్యం దుకాణం తొలగించారు. అయితే రిటైల్ విభాగంలో మళ్లీ ఏర్పాటు చేయాలని పలువురు స్థానికులు పావులు కదుపుతున్నారు.

తాజా ఘటన పరిశీలిస్తే..

అటకానితిప్పలో ప్రభుత్వ మద్యం దుకాణం ఎత్తివేసిన వెంటనే మూడు చోట్ల బెల్టు దుకాణాలు వెలిశాయి. మూడురోజుల కిందట ఇక్కడకు షార్ నుంచి పలువురు వచ్చి మద్యం కొనుగోలు చేసి అక్కడే తాగిన మందుబాబులు ఆ ప్రాంత మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఇది కాస్తా షార్‌లోని ఓ విభాగం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. వారు ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా బాధితులతో సర్దుబాటు చేసుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకునే షార్ యాజమాన్యం ఇక్కడ మద్యం దుకాణం వద్దని సూచిస్తోంది.



ఆలయం ఎదుట శ్రీనువైట్ల, విశ్వప్రసాద్, శ్రీకాంత్ తదితరులు

తిరుమలలో విశ్వం చిత్ర బృందం

తిరుమల: శ్రీవారిని ఆదివారం ఉదయం విశ్వం చిత్ర దర్శకుడు శ్రీనువైట్ల, సినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్, నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయం వెలుపల శ్రీనువైట్ల మాట్లాడుతూ.. విశ్వం చిత్రం విజయవంతం కావడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు వచ్చామన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ.. రామ్‌చరణ్‌తో గేమ్ ఛేంజర్, సాయిదుర్గ తేజ్‌తో ఓ చిత్రం చేస్తున్నానని, తానే హీరోగా మరో చిత్రం చేస్తున్నట్లు తెలిపారు. తన కుమారుడు రోషన్ అశ్వనీదత్ సమర్పించే 'చాంపియన్' అనే చిత్రం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	151
లేయర్	115
బ్రాయిలర్స్	219
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	249
లేయర్ మాంసం	195

రేణిగుంటలో అంతర్జాతీయ క్రీడా ప్రాంగణం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రేణిగుంటలో అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రాంగణాన్ని అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం రాష్ట్రస్థాయి జుడో క్రీడాకారుల ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. రాష్ట్రమంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ స్థాయిలో అన్నిరకాల క్రీడల నిర్వహణకు వీలుగా అభివృద్ధి చేయసంకల్పించినట్లు వివరించారు. శాప్ తరఫున శ్రీకాళహస్తి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా అభివృద్ధి పరచాలని కూటమి ప్రభుత్వం సంకల్పించినట్లు వివరించారు. జాతీయ స్థాయి జూడో క్రీడాకారిణి ఝాన్సీకి, ఆమెకు శిక్షణ ఇచ్చిన శిక్షకులు గోపికి ఒక్కొక్కరికి రూ.10 వేలు వంతున ప్రోత్సాహకాలను అందజేశారు. శాప్ ఛైర్మన్‌తో కలసి రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపిక పోటీలను ప్రారంభించారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జగన్నాథనాయుడు, కిరణ్‌యాదవ్, జూడో రాష్ట్ర పరిశీలకులు ప్రతాప్‌రెడ్డి, ఎంఈవో బాలయ్య, ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, ఎస్‌ఎంసీ ఛైర్మన్ విమలారెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నెలకొన్న క్రీడా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని శాప్ కార్యాలయంలో ఆదివారం భారత హాకీ క్రీడాకారిణి రజని.. శాప్ ఛైర్మన్ రవినాయుడును మర్యాదపూర్వంగా కలిసి క్రీడా రంగంలోని సమస్యలపై చర్చించారు. పలు సమస్యలను ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్, హాకీ సంఘం సభ్యులు ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు.



ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.రాజేశ్వరరావు

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.రాజేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో జస్టిస్ సుధీర్‌కుమార్

మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: శ్రీవారిని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్ ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఎంపికైన బాక్సింగ్ జట్టుతో పీడీలు తదితరులు

రాష్ట్ర స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు): ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ చదరంగం, బాక్సింగ్ జట్ల బాలబాలికల ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపారు. తిరుపతిలోని శ్రీశ్రీనివాస క్రీడా సముదాయంలో ఆదివారం చదరంగం పోటీలు, తిరుచానూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో బాక్సింగ్ పోటీలు నిర్వహించినట్లు వివరించారు. ఉత్తమ ప్రతిభకనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

వెంకటగిరి: అక్రమంగా గంజాయి రవాణ చేస్తున్న ఇద్దరి నుంచి 21 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటరమణ తెలిపారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ.. కేరళకు చెందిన షైజల్, ఉన్నికృష్ణన్ ఒడిశా ఇతర ప్రాంతాల్లో గంజాయి కొనుగోలు చేసి కేరళలో అధిక మొత్తంలో విక్రయించేవారన్నారు. శనివారం రాత్రి రూ.2.36 లక్షల విలువైన 21 కిలోల గంజాయితో వెంకటగిరి రైల్వేస్టేషన్ వద్ద ఉండగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రెండు చరవాణీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



గంజాయి వివరాలు తెలుపుతున్న సీఐ వెంకటరమణ

కళాశాల ఇన్‌ఛార్జిపై విద్యార్థి కత్తితో దాడి

తిరుచానూరు: తిరుచానూరు పంచాయతీ పరిధిలోని వసుంధర నగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కళాశాల ఇన్‌ఛార్జి రమణపై ఆదివారం కత్తితో దాడి చేశాడు. కార్యాలయంలో ఆయన కూర్చుని మాట్లాడుతుండగా విద్యార్థి వెనుక నుంచి కత్తితో దాడికి పాల్పడ్డాడు. గాయపడిన ఆయన్ని కళాశాల సిబ్బంది రుయాకు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. దాడి చేసిన విద్యార్థి కళాశాల నుంచి పారిపోయాడు.



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న ఘనత ఏఐఎస్ఎఫ్‌కే దక్కిందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో ఉమ్మడి జిల్లాకు చెందిన జిల్లా మాజీ విద్యార్థి ఉద్యమ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. వచ్చేనెల 27 నుంచి మూడు రోజుల పాటు విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, రామానాయుడు, లక్ష్మయ్య, ఎస్.ఈశ్వరయ్య, కత్తి నరసింహారెడ్డి, రాజశేఖర్, రమణ, విశ్వనాధరెడ్డి, మోహన్‌కుమార్, మంజునాథ్, సోంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఎర్రచందనం, స్మగ్లర్లను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ బలగాలు

ఎర్రచందనం స్వాధీనం: ముగ్గురి అరెస్ట్

తిరుపతి(జీవకోన), న్యూస్‌టుడే: బాకరాపేట సమీపంలో ఆదివారం జరిగిన టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్సైలు విశ్వనాథ్, లింగాధర్ బృందాలు బాకరాపేట సమీపంలోని కోటబైలు అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తున్న వారిని గుర్తించి పట్టుకున్నారు. 14 దుంగలు, కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

మత ప్రార్థనల కోసమే బాలిక అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: ఇంటి నుంచి అదృశ్యమైన బాలిక(14) ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపారు. శనివారం తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన బాలిక తండ్రి తన కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు చేశారు. తిరుపతి తూర్పు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సికింద్రాబాద్‌లోని ఓ చర్చిలో జరిగే ప్రార్థనల్లో పాల్గొనేందుకు రైలులో వెళ్లాలనుకుని తిరుపతి రైల్వేస్టేషన్‌కు వెళ్లింది. పోలీసులు ఆ సమయంలో సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లను పరిశీలించారు. సీఐ ఆదోనిలో పరిచయమున్న స్నేహితులకు బాలిక ఫొటో పెట్టి సంబంధిత రైలులో పరిశీలించాలని చెప్పారు. బెర్తులో నిద్రిస్తున్న బాలికను గుర్తించి రాయచూర్ రైల్వే పోలీసుల సహకారంతో అనంతపురం జిల్లా గుత్తికి తీసుకొచ్చారు. రైల్వే పోలీసుల సహకారంతో తిరుపతి తూర్పు పోలీసులు తిరుపతికి తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కోతి తెచ్చిన తంటా

రైల్వేకోడూరు: కోతికి పండు ఇస్తే అది తినకుండా కింద పడేయడంపై వివాదం నెలకొని ఒకరిని కత్తితో పొడిచిన ఘటన ఆదివారం జరిగింది. అన్నమయ్య జిల్లా బొంతవారిపల్లెకు చెందిన జవ్వాది లక్ష్మయ్య, రేవూరి సునీల్‌కుమార్, పండుగోల శేఖర్‌లు ఆదివారం రేణిగుంటలోని శ్రీకటాపుటాలమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. రేణిగుంటలో రైలెక్కి తిరుగు ప్రయాణమయ్యారు. వారు ఎక్కిన బోగీలోనే కోతిని ఆడించే వ్యక్తి ఉన్నారు. సునీల్‌కుమార్ కోతికి పండు ఇవ్వగా అది కింద పడేసింది. దీంతో కోతిని తిట్టడంతో రెహమాన్ ఆగ్రహించాడు. ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో రెహమాన్ తన వద్ద ఉన్న చాకుతో సునీల్‌కుమార్‌పై దాడి చేశాడు.

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

ఆరుబయట మహారథం



తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిసిన నేపథ్యంలో శ్రీవారి మహారథాన్ని పూర్తిస్థాయిలో భద్రపరచాల్సి ఉంది. అయితే గత కొన్ని రోజులుగా వర్షానికి మహారథానికి ప్లాస్టిక్ పట్టలతో మూసి ఉంచుతున్నారు. త్వరగా మహారథాన్ని ఇనుపరేకుల మధ్య భద్ర పరిచేందుకు తితిదే అధికారులు చర్యలు చేపట్టారు. ఇంతలోపు ఎవరూ మహారథం వద్దకు చేరకుండా నిఘాను పెంచారు.

క్రీడాకారులకు అభినందనలు

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: జంప్ రోప్ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను శాప్ ఛైర్మన్ రవినాయుడు అభినందించారు. ఇటీవల నాసిక్ వేదికగా జరిగిన పోటీలో రాష్ట్ర నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు స్వర్ణ పతకం సాధించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

చంద్రగిరి, న్యూస్‌టుడే

సమస్య: ఎం.కొత్తపల్లి గ్రామంలో పది రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు.

- చంద్రయ్యనాయుడు, ఎం.కొత్తపల్లి

సమాధానం: సమస్య మా దృష్టికి రాలేదు. రెండు రోజుల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేస్తాం.

- శిరీష, కార్యదర్శి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే

సమస్య: దొడ్డాపురం వీధి నుంచి రాములవారి గుడికి వెళ్లే చిన్న సందు చివరలో ఖాళీ స్థలం ఉంది. ఇక్కడ ఎప్పుడూ చెత్త దిబ్బగా వేస్తుంటారు.

-అభిరామ్, స్థానికుడు

సమాధానం: చెత్తను వెంటనే తొలగిస్తాం.

- డా.యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక



ఆలయ అధికారులకు ముత్యాలహారం అందిస్తున్న భక్తులు

కోదండరాముడికి ముత్యాలహారం

చంద్రగిరి, న్యూస్‌టుడే: స్థానిక శ్రీకోదండరామస్వామికి పచ్చరాయి, వెండితో పొదిగిన ముత్యాలహారంను ఆదివారం భక్తులు కానుకగా సమర్పించారు. చంద్రగిరికి చెందిన ఎం.లక్ష్మీ కుటుంబ సభ్యులు మూడు రకాల ముత్యాలు, పచ్చరాయి, లేతపచ్చ, పింక్ రాళ్లతో వెండితో పొదిగిన రూ.28,675 విలువైన హారాన్ని దేవాలయ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబుకు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ప్రధాన అర్చకులు శ్రీనివాసబట్టర్, అర్చక బృందం పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు



సినీనటుడు ధనరాజ్

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం కేంద్ర మాజీ మంత్రి ఎం.పల్లంరాజు, సినీనటుడు ధనరాజ్, ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు.

ఊ అంటారా.. ఊహూ అంటారా?

- గత ప్రభుత్వంలో వైకాపా నేతల భూ ఆక్రమణలు
- వాటాలు ఇవ్వాలంటూ ప్రస్తుత నాయకుల బేరసారాలు
- తిరుపతి అర్బన్ మండలంలో ఇదీ పరిస్థితి

గత ప్రభుత్వంలో రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు కుమ్మక్కై భూ ఆక్రమణలకు పాల్పడ్డారు. ప్రభుత్వ భూములు, కుంటలు, చెరువులు, కాలువ పోరంబోకు స్థలాలను సైతం వదలకుండా కట్టడాలను నిర్మించారు. అన్నీ తెలిసిన రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. - న్యూస్‌టుడే, తిరుపతి(రెవెన్యూ)

తిరుపతి అర్బన్ మండలం పరిధిలోని చెరువులు, కుంటలు, కాలువ పోరంబోకు స్థలాలు కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. సర్వే నంబరు 119/2లో శెట్టిపల్లె చెరువు 22.09 ఎకరాలు, సర్వే నంబరు 33లో చెన్నాయగుంట చెరువు 13.5 ఎకరాలు, సర్వే నంబరు 6/2లో మంగళం చెరువు 75.88 ఎకరాలు, సర్వే నంబరు 85లో అన్నాచెరువు 77.46 ఎకరాలు, సర్వే నంబరు 84లో పాన్‌చెరువు 49.4 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. వీటిల్లో సగానికిపైగా ఎకరాలను గత వైకాపా ప్రభుత్వ అండతో ఆ పార్టీ నాయకులు జోరుగా ఆక్రమించుకున్నారు. చెరువు అనే ఆనవాళ్లు లేకుండా చదును చేసి ప్లాట్లు వేసి నిర్మాణాలు సైతం చేపట్టారు. వీటిపై గతంలో పనిచేసిన తహసీల్దార్ వెంకటరమణకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఒకవేళ చర్యలు తీసుకున్నా ఎమ్మెల్యే భూమన, ఆయన తనయుడు అభినయ్, కార్పొరేటర్ల నుంచి ఒత్తిళ్లు రావడంతో చేసేది లేక చూసీచూడనట్లు వ్యవహరించారు. దీంతో ఆక్రమణలు



ఆక్రమణల చెరలోని పాన్ చెరువు

మరింత జోరందుకున్నాయి.

ప్రభుత్వ, నిషేధిత భూముల్లోనూ...

మండలం పరిధిలోని సుబ్బారెడ్డి నగర్, చంద్రశేఖర్ రెడ్డి కాలనీ, మంగళం, పోస్టల్ కాలనీ, తిరుపతి పట్టణ ప్రాంతాల్లో ప్రభుత్వ, నిషేధిత జాబితా, మఠం భూములు ఉన్నాయి. వీటిల్లోని కొన్ని భూముల్లో సెంట్ల లెక్కన ప్రభుత్వం నిషేధిత జాబితా, అనాధీనంలో ఉంచింది. వీటిని సైతం వైకాపా నాయకులు ఆక్రమించి చిన్నపాటి గుడిసెలు, ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. ఉదాహరణకు మంగళం సర్వే నంబరు 23లో భూములకు 22(ఎ) తీసేసి, దీనికి రైత్వారీ పట్టా ఇవ్వడం, అక్రమంగా తుడా అనుమతులు, లేఅవుట్లు వేయడంపై అన్నమయ్య జిల్లా పర్యటనలో సాక్షాత్తు రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోసిదియా ప్రశ్నించడమే ఇందుకు నిదర్శనం.

- గతంలో ఆక్రమణలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవడం కోసం కూటమి నేతలు బేరసారాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆక్రమించుకున్న భూముల్లో వాటా ఇవ్వాలని, లేకపోతే ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎవరికీ లేకుండా చేస్తామంటూ బేరసారాలు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని, ఆక్రమణకు గురైన భూములు స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

చెరువు చదును చేయడం, ప్రభుత్వ భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరం. గతంలో జరిగిన వాటిని పరిశీలిస్తాం. జలవనరుల, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు చేయనున్నాం. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. **-భాగ్యలక్ష్మి, తిరుపతి అర్బన్ తహసీల్దార్**



సీనియర్లను సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు

సీనియర్ వాకర్స్‌కు సత్కారం

తిరుపతి(బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: వయసు పైబడ్డా ఎంతో ఉత్సాహంగా రోజూ వాకింగ్ చేస్తున్న 80 సంవత్సరాలు దాటిన వాకర్స్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల వాకర్స్, తారకరామ మైదానం వాకర్స్ అసోసియేషన్లలోని వీరిని సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత డీఎస్పీ శంకర్, కార్పొరేటర్ బాబు, భాస్కర్‌రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఆదివారం చెన్నైకు చెందిన శివకుమార్ బృందం కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. ఇందులో భాగంగా పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు కనువిందు చేశాయి. కార్యక్రమంలో ఏవో ఖాదర్‌వల్లీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక





మధుశ్రీ నేహా

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: మండలంలోని స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ పరిమళ తెలిపారు. తిరుపతిలోని ఎంజీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-19 విభాగం పోటీల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మధుశ్రీ, నేహా విశేష ప్రతిభ చూపారన్నారు.

భాషల పరిరక్షణ తప్పనిసరి: వీసీ



అవార్డులు తీసుకున్న గ్రహీతలు

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : భారతీయ భాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీఎస్‌యూ వీసీ విజయభాస్కర్‌రావు ఉద్బోధించారు. లేకుంటే భవిష్యత్తులో ప్రమాదంలో పడతాయన్నారు. అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాలలో సదస్సు చేపట్టారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహితీవేత్తలకు అవార్డులు, పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో డీకే ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.గిరి, అఖిల భారత భాషా సాహిత్య సమ్మేళన్ జాతీయ అధ్యక్షులు వీరేంద్రసింగ్, ప్రధాన కార్యదర్శి చతుర్వేది, తెలంగాణ అధ్యక్షులు సత్యమూర్తి, కార్యదర్శి చక్రవర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎలిజబెత్ జయకుమారి, ఒడియా కవయిత్రి సుశ్రీసంగీత మిశ్ర, ఆంగ్ల కవి లక్ష్మణరావు, హిందీ రచయిత రామలింగేశ్వరరావు, నారాయణ ఐఏఎస్ అకాడమీ ప్రిన్సిపల్ కె.సరోజినీదేవి, కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాలిన విద్యుత్ స్తంభం



రామచంద్రాపురం మండలం నుంచి నడవలూరుకు వెళ్లే మార్గంలో రహదారి పక్కన పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభం వాలిపోయి ప్రమాదకరంగా ఉంది. ఏదేని అనుకోని సంఘటన జరగక ముందే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. **-ఈనాడు, తిరుపతి**

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి



పాల్గొన్న ఎంఈవో బాబ్జీ తదితరులు

పాకాల, న్యూస్‌టుడే: సమాజంలో ప్రజలందరికీ సమాన హక్కులు అమలు కావాలంటే ప్రతి పౌరుడు భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని పాకాల గ్రంథాలయాధికారి తాళ్ల రవీంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఆదివారం నిర్వహించిన 'రాజ్యాంగ హక్కులు-అధ్యయన తరగతుల' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను వివరించారు. ఎంఈవో బాబ్జీ, ఆమూరి సుధాకర్, రామయ్య, ప్రభు, జ్యోతి వెంకటరత్నం, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో ఎస్బీఐది ప్రత్యేక స్థానం

తిరుపతి(మంగళం): దేశ ఆర్థిక వ్యవస్థ పురోభివృద్ధిలో ఎస్బీఐది ప్రత్యేక స్థానమని ఎస్బీఐ ఎస్‌యూఏసీ అధ్యక్షుడు ఎస్.కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తిరుపతి అర్బన్ మండలం మంగళంలోని ఓ ప్రైవేటు హాలులో ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ రెండో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సోమవారం నూతన కార్యవర్గ ఎన్నిక జరుగుతుందన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉద్యోగులతో మాట్లాడి, సూచనలు చేశారు. ఎస్బీఐ అధికారులు వినోద్‌కుమార్‌మిశ్రా, రాజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: సి.మల్లవరం గ్రామంలో హీటర్ కారణంగా ఇల్లు కాలిపోయిన కుటుంబసభ్యులకు గ్రామ తెదేపా బాధ్యుడు మనోహర్‌చౌదరి ఆదివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. శనివారం ఎస్సీకాలనీకి చెందిన రామకృష్ణ, లక్ష్మీకాంతమ్మ ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోయిందని తెలిపారు. ఇంట్లోని వస్తువుల సైతం కాలి బూడిదయ్యాయని చెప్పారు.

గుంతల రోడ్డుపై ఇక్కట్లు



తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: స్థానిక తిరుపతి-రేణిగుంట రోడ్డులోని హీరో బైక్ షోరూంకు ఎదురుగా చింతలచేనుకు వెళ్లే మార్గంలో, రైల్వే గేటుకు సమీపంలో రోడ్డు గుంతలమయంగా ఉంది. రహదారిపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

అతుకులు వేయక.. అవస్థలు తీరక

- పట్టించుకోని తుడా, పంచాయతీ అధికారులు
- ధనలక్ష్మీనగర్‌లో ఇదీ పరిస్థితి

వైకాపా ప్రభుత్వం అభివృద్ధి పేరుతో చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. సగం సగం పనులతో నెలల తరబడి నరకం అనుభవిస్తున్నారు. ఇదేదో మారుమూల పంచాయతీ పరిధిలోని గ్రామం కాదు. తిరుపతికి ఆనుకుని ఉన్న గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మీనగర్‌లో యూడీఎస్ పనులు చేపట్టి సుమారు పది నెలలు పూర్తయినా, ఇంత వరకు రోడ్డు మధ్యలో తీసిన గోతులకు అతుకులు వేయలేదు. నిధులు అరకొరగా మంజూరు చేయడంతో పనులు ఆగిపోయి, నిత్యం అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, తిరుపతి(గ్రామీణ)





కాలనీలో గుంతలమయంగా రోడ్డు నడిరోడ్డులో మొలుస్తున్న గడ్డి

పరిష్కారం చూపాలంటున్న స్థానికులు

తిరుపతి గ్రామీణ మండలం గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మీనగర్‌లో సుమారు 400 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీ ఏర్పడి సుమారు పాతికేళ్లు కావస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ రోడ్లన్నీ 15 అడుగుల వెడల్పుతో ఉన్నాయి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గ్రామంలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఎన్నికలకు ముందు తుడా నిధులు సుమారు రూ.35 లక్షలతో పనులు ప్రారంభించారు. ఎన్నికలు జరగకముందే రోడ్డు మధ్యలో గాడి తీసి పైపులు వేసి, అక్కడక్కడ మ్యాన్‌హోల్‌లు ఏర్పాటు చేశారు. తీసిన గోతులకు మట్టి పోశారు. కొద్దిరోజులు కుంగిన తర్వాత సిమెంట్‌తో అతుకులు వేయాల్సి ఉంది. ఆ తర్వాత సిమెంట్ రోడ్డు వేస్తే పని పూర్తయిపోతుంది. అప్పటికి కేటాయించిన నిధులు సరిపోవడంతో సదరు గుత్తేదారు మట్టిపోసి గోతులు పూడ్చారు. ఇటీవల వర్షాలకు ఈ గుంతలు మరింతగా కుంగిపోయాయి. ద్విచక్రవాహన చోదకులు రాకపోకలు సాగించాలంటే, రాత్రి వేళ ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు పలు దఫాలుగా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ, తుడా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్లకు అతుకులు వేసి మరమ్మతులు చేయాల్సి ఉంది.

అంచనాలు పంపిస్తాం

ధనలక్ష్మీనగర్‌లో యూడీఎస్ ఏర్పాటు చేసి రోడ్డుకు అతుకులు వేయక పోవడంతో ఇబ్బందిగా ఉందని ప్రజలు మా దృష్టికి తీసుకొచ్చారు. నేను ఇటీవలే బాధ్యతలు స్వీకరించా. ఈ పనులకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకుంటాం. పంచాయతీ నిధులతో చేయడానికి అవకాశం ఉందేమో చూస్తాం. లేని పక్షంలో అసంపూర్తి పనులకు సంబంధించి అంచనాలు పంపించమని ఉన్నతాధికారులు అడిగితే పంపిస్తాం.

-విజయనిర్మల, కార్యదర్శి, గాంధీపురం పంచాయతీ





రామానుజ కూడలి వద్ద కనిపిస్తున్న ఇనుప ప్లేట్లు పుట్టినరోజు వేడుకలు చేసుకుని పడేసిన వ్యర్థాలు

మందుబాబులకు అడ్డాగా.. వేడుకలకు నిలయంగా



ఖాళీ మద్యం సీసాలు

తిరుపతిలో తిరుమల శ్రీవారి భక్తుల ట్రాఫిక్ కష్టాలు తగ్గించడానికి శ్రీనివాససేతు నిర్మాణం జరిగిన విషయం తెలిసిందే. అయితే వారధిపై ప్రత్యేక సందర్భాలు, ప్రముఖులు వచ్చినప్పుడు మాత్రమే అధికారుల పర్యవేక్షణ ఉంటోంది. మిగిలిన రోజుల్లో లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. పుట్టినరోజు వేడుకలకు నిలయంగా మారింది. రామానుజ కూడలి వద్ద వలయాకారంలో తారు కొట్టుకుపోవడంతో ఇనుప ప్లేట్లు బయటికి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి. నంది కూడలి వైపు శంఖు నమూనా సమీపంలో ఇసుక, మట్టి పేరుకుపోవడంతోపాటు రహదారి పగుళ్లిచ్చింది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

మురుగు పారేదెలా!



స్థానిక అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రం వద్ద ఉన్న వర్షపునీటి కాలువ రాళ్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, వ్యర్థాలతో నిండి ఉంది. వర్షాల నేపథ్యంలో సంబంధిత అధికారులు పర్యవేక్షించి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **-ఈనాడు, తిరుపతి**

వర్షానికి కూలిన ఇల్లు

చిన్నగొట్టిగల్లు: జంగావాండ్లపల్లి పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లికి చెందిన నాగలి రమణ ఇల్లు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

తిరుమల ఘాట్‌రోడ్డులో ప్రమాదం

భక్తులకు స్వల్ప గాయాలు





రక్షణ గోడను ఢీకొన్న కారు గాయపడిన భక్తులు

తిరుమల, న్యూస్‌టుడే: తమిళనాడుకు చెందిన కారు అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొన్న ఘటన తిరుమల ఘాట్‌రోడ్డులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు భక్తులు కారులో తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం కారులో మొదటి ఘాట్‌రోడ్డు మీదుగా తిరుపతికి బయలుదేరారు. వాహనం 15వ మలుపు వద్దకు చేరుకుంటుండగా అదుపుతప్పి రహదారి పక్కన రక్షణ గోడను ఢీకొంది. ప్రమాదంలో కారులోని భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కారును పక్కకు తొలగించి వాహన రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదంపై తిరుమల ట్రాఫిక్ పోలీసులు పరిశీలిస్తున్నారు.

తిరుమలలో వ్యక్తి ఆత్మహత్య

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని కర్ణాటక భవనం సమీపంలో ఓ వ్యక్తి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుమల వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గుండు చేయించుకున్న గుర్తుతెలియని సుమారు 45-50 ఏళ్ల వ్యక్తి కర్ణాటక భవనం సమీపంలోని ఓ ఇనుప స్టాండ్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని ఆచూకీ కోసం యత్నించగా ఆధారాలు లభించలేదు. ఎడమ మోచేయిపై నుంచి భుజాల వరకు వినాయకుడి పచ్చబొట్టు, కుడిచేతిపై హనుమంతుని పచ్చబొట్టు ఉన్నాయి. మృతదేహాన్ని తితిదే అశ్విని ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌కు జరిమానా

తిరుపతి(నేరవిభాగం): శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్‌లో అపశవ్య దిశగా ప్రయాణించిన ఆటోకు భారీ జరిమానా విధించారు. వన్‌వేలో వస్తున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు నిఘా పెట్టారు. ఆదివారం లీలామహల్ వద్ద అపశవ్య దిశగా వస్తున్న ఆటోను గుర్తించి జరిమానా వేశారు.

వాయిదాలకు హాజరు కాకపోవడంతో రిమాండ్

రేణిగుంట: హత్యాయత్నం కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాక పోవడంతో ముద్దాయిని న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు రేణిగుంట పట్టణ పోలీసు స్టేషన్ రైటర్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక తారకరామనగర్‌కు చెందిన పార్థసారథి అలియాస్ సారథిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఆరు నెలలుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతుంటే తిరుపతి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి అరెస్టు వారెంట్ జారీ చేశారు. సీఐ శరత్‌చంద్ర ఉత్తర్వుల మేరకు రేణిగుంట పోలీసులు సారథిని న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

దారిలోనే కనిపిస్తున్నావు దేవుడా!

- అప్పలాయగుంట రోడ్డుకు మోక్షమెప్పుడో?
- భక్తులకు తప్పని అగచాట్లు





గుంతలు, రాళ్లు తేలిన కమ్మపల్లి రహదారి కమ్మేసిన చెట్లు, గుంతల్లో వాహనదారుల అవస్థలు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: వడమాలపేట మండలంలోని అప్పలాయగుంటలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రామచంద్రాపురం మండలం కమ్మపల్లి మీదుగా నిత్యం భక్తులు వెళ్తుంటారు. ఆలయానికి ఈ మార్గం దగ్గర కావటంతో రామచంద్రాపురం, చంద్రగిరి, వెదురుకుప్పం, తిరుపతి రూరల్, అర్బన్ మండలాలతోపాటు పలు ప్రాంతాల నుంచి వస్తుంటారు. 15 ఏళ్ల క్రితం మాజీ మంత్రి దివంగత నేత గాలి ముద్దుకృష్ణమనాయుడు చొరవతో ఈ మార్గాన్ని ర.భ శాఖ ఏర్పాటు చేసిందని స్థానికులు చెబుతున్నారు. అనంతరం ప్రభుత్వాలు మారుతున్నా.. ఆ రోడ్డు మరమ్మతులను ప్రజాప్రతినిధులు, అధికారులు మరచిపోయారు. ప్రస్తుతం ఈ రహదారి అక్కడక్కడ కోతకు గురై.. కంకర తేలింది. గుంతలు ఏర్పడి వర్షపు నీరు గుంతల్లో చేరి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో రాకపోకలు చేయాలంటే తీవ్ర ఇబ్బందులు తప్పట్లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి.. ఈ రహదారికి మరమ్మతులు చేయాలని మండల ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేలు చొరవ చూపాలి



కమ్మపల్లి నుంచి అప్పలాయగుంటకు వెళ్లే రహదారి బాగుకు చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి. రోడ్డుకిరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. **-నీలకంఠచౌదరి, కమ్మపల్లి**

రోడ్డు విస్తరణ చేయాలి



సింగిల్ లైన్‌గా ఉన్న ఈ రహదారిని రెండు వరుసలుగా విస్తరించాలి. ఈ పనులకు తితిదే చొరవ చూపితే బాగుంటుంది. **-సుధాకర్‌నాయుడు, పులిగుంట**

శ్రీకాళహస్తి
•శ్రీకాళహస్తి • సత్యవేడు


నాట్య గణపతికి విశేష అలంకరణలు

ఘనంగా సంకటహర చతుర్థి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంకటహర హోమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలోని అంజి అంజి వినాయక స్వామి ఆలయం వద్ద ఆదివారం వేద మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకస్వామికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాల అనంతరం వెండి ఉడుపులతో అలంకరణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు. ● ముక్కంటి ఆలయానికి అనుబంధంగా జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని నాట్యగణపతికి విశేష అభిషేకాలు చేపట్టారు. అలంకరణలు పూర్తయ్యాక ధూప, దీప, నివేదనలు సమర్పించారు.

ఆలయానికి చక్రాల కుర్చీల వితరణ

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆలయ మాజీ ఉద్యోగి సతీమణి నాగభూషణమ్మ రెండు చక్రాల కుర్చీలను వితరణగా అందజేశారు. ఆమె భర్త వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వీటిని శనివారం ఆలయ డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో హేమమాలిని, సూపరింటెండెంట్ కల్యాణి, శ్రీహరి, అకౌంటెంట్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.


చక్రాల కుర్చీలను వితరణగా ఇచ్చిన నాగభూషణమ్మ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తొట్టంబేడు, న్యూస్‌టుడే: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేంద్రనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్న కార్యక్రమానికి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరై అధ్యక్షత వహిస్తారన్నారు. మండలంలోని ప్రజలు తమ సమస్యల పరిష్కారం నిమిత్తం వినతులు సమర్పించుకునేందుకు వచ్చునని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.


మైదానం అభివృద్ధిపై రవినాయుడితో చర్చిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, కోలా ఆనంద్

'జగన్ ఆంధ్రాతో ఆడుకున్నారు'

తొట్టంబేడు, న్యూస్‌టుడే: వైకాపా ఐదేళ్ల పాలనలో క్రీడాభివృద్ధిని విస్మరించి మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆంధ్రాతో ఆడుకున్నారని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు సంయుక్తంగా విమర్శించారు. ఆదివారం శ్రీకాళహస్తి పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించిన శాప్ ఛైర్మన్ రవినాయుడు అనంతరం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి పురుషుల డిగ్రీ కళాశాల అవరణలోని క్రీడా వికాస కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలోని ఇండోర్ స్టేడియాన్ని, వ్యాయామశాలను నేతలతో కలిసి పరిశీలించారు. రానున్న సంవత్సర కాలంలో ఇక్కడ అన్ని వసతులు కల్పించి అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, కూటమి నేతలు పాల్గొన్నారు.


సువర్ణముఖి తీరంలో పడేస్తున్న వ్యర్థాలు, కుళ్లిన టమాటాలు తదితర నిల్వలు

సూచికలున్నా.. శుభ్రత కరవు

సువర్ణముఖి తీరం వెంబడి అధ్వానం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సువర్ణముఖి తీరాన్ని శుభ్రంగా ఉంచాలన్న ప్రజాప్రతినిధుల ఆశలు ఫలించడం లేదు. తీరం అధ్వానం చేసే వాళ్లకు జరిమానాలు విధిస్తామని సూచికలున్నా.. ఎంచక్కా వ్యర్థాలను పడేస్తున్నా పట్టించుకునే వాళ్లు లేరు. దీంతో శుభ్రం చేసిన ప్రాంతమంతా మళ్లీ వ్యర్థాల మయంగా మారుతోంది.

వ్యర్థాలతో అపరిశుభ్రం: సువర్ణముఖి తీరం సమీపంలో పాఠశాల, వినాయకస్వామి ఆలయం, నూతనంగా నిర్మించిన గ్రంథాలయం ఇవన్నీ ఉండడంతో కొన్నాళ్ల పాటు శుభ్రంగా ఉంటూ వచ్చింది. అయితే మళ్లీ వ్యర్థాలు పెరిగిపోతున్నాయి. ప్రారంభంలోనే నియంత్రించకుంటే మళ్లీ యథేచ్ఛగా పెరిగిపోవడం తథ్యం. ఈ దిశగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.

తీరం.. సుందరమే లక్ష్యం

గత వైకాపా హయాంలో సువర్ణముఖి నది సుందరీకరణ చేపట్టే వచ్చారు. రూ.7 కోట్ల వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసిన క్షేత్ర స్థాయిలో రూ.2.50 కోట్లు వ్యయం చేసి చేతులు దులుపుకున్నారు. రివర్‌వ్యూ లాడ్జి నుంచి రామసేతు వంతెన వరకు ఫ్లడ్‌వాల్ నిర్మించి మిన్నకుండిపోయారు. కరకట్టపై పోసిన మట్టి వర్షాలకు కొట్టుకుపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం రామసేతు వంతెన వరకే కాకుండా అనకట్ట వరకు సువర్ణముఖి నది తీరం సుందరంగా ఉండాలని సంకల్పించారు. అందులో భాగంగా తీరం వెంబడి ఉన్న వ్యర్థాలు తొలగించారు. ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు తొలగించారు. చెత్తకుప్పలతో పాటు వ్యర్థాలు వేసేవారికి జరిమానా విధించేలా సూచికలు ఏర్పాటు చేశారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

సత్యవేడు, న్యూస్‌టుడే: గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టిందని ఎంపీడీవో చంద్రశేఖర్ స్పష్టం చేశారు. పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని ఉలవపేను, దళవాయి అగ్రహారంలో రూ.10లక్షల వ్యయంతో సిమెంట్ నిర్మాణానికి ఎంపీడీవో చంద్రశేఖర్ భూమిపూజ చేశారు. పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఇబ్రహీం, పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్, తెదేపా మండలాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు హేమభూషణం, రాజశ్యక్షణ, శశి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. **ఏర్పేడు:** పల్లెపండగ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మాధవమాల పంచాయతీ మండికండ్రిగలో ఆదివారం సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమానికి తెదేపా అధికార ప్రతినిధి గురవారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై స్థానిక నేతలతో కలిసి శంకుస్థాపన చేశారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు పొన్నారావు, చంద్రారెడ్డి, రవినాయుడు, కరిముల్లా, కన్నప్పరెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.


రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్, నాయకులు వీకేఎన్ బాష తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

న్యూస్‌టుడే, తొట్టంబేడు

సమస్య: మండలంలోని పెద్దకన్నలి పంచాయతీ బీసీ కాలనీతో పాటు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అక్కడక్కడ వీధి దీపాలు వెలగడంలేదు. దీంతో రాత్రుల్లో భయాందోళన చెందుతున్నాం. పాముల బెడద తీవ్రమైంది.
- వివేక్‌కుమార్, స్థానికుడు

సమాధానం: సమస్య మాదృష్టికి రాలేదు. వెంటనే పరిశీలించి వీధి లైట్లు ఏర్పాటు చేయిస్తాం.
- సురేంద్రనాథ్, ఎంపీడీవో

న్యూస్‌టుడే, రేణిగుంట

సమస్య: రేణిగుంట పంచాయతీ వివేకానందకాలనీలో వీధి దీపాలు లేక పోవడంతో ఇబ్బందిగా మారింది. వృద్ధులు, చిన్నారులు విషపురుగులతో ఆందోళనకు గురౌతున్నారు.
- రమణ, స్థానికుడు

సమాధానం: ఇక్కడ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- మణి, పంచాయతీ కార్యదర్శి, రేణిగుంట

న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

సమస్య: రైల్వేస్టేషన్ సమీపంలోని భారతీనగర్‌లో మట్టి రోడ్డుతో అవస్థలు తప్పడం లేదు. వర్షం పడితే రోడ్డు పొడవునా చిత్తడిగా మారుతోంది. కాలు పెట్టాలంటే ఎక్కడ జారిపోతామోనన్న భయం వెంటాడుతోంది.
- మునిరత్నం, భారతీనగర్, శ్రీకాళహస్తి

సమాధానం: కొత్త రోడ్లకు త్వరలో ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. ఈ ప్రాంత పరిస్థితులను గుర్తించి రోడ్డు ఏర్పాటుపై చర్యలు తీసుకుంటాం.
- గిరికుమార్, కమిషనర్, శ్రీకాళహస్తి పురపాలక సంఘం

న్యూస్‌టుడే, ఏర్పేడు

సమస్య: మండలంలోని చిందేపల్లిలో వీధులు గుంతలగా మారడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. దీంతో స్థానికులు ఇంటి నుంచి వీధిలోకి అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

సమాధానం: పంచాయతీ కార్యదర్శితో చర్చించడంతో పాటు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.
- సౌభాగ్యం, ఎంపీడీవో, ఏర్పేడు

న్యూస్‌టుడే, నారాయణవనం

సమస్య: మండలంలోని చిత్తూరు కండ్రిగ ఏఏడబ్ల్యూలో తాగునీటి బోరు మోటారు మరమ్మతుకు గురైంది. దీంతో ప్రజలు తాగునీటికి బోరు బావుల వద్దకు పరుగులు తీస్తున్నారు.
- కుప్పయ్య, స్థానికుడు

సమాధానం: మరమ్మతుకు గురైన బోరు మోటారును బాగుచేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.
- గుణశేఖర్, ఎంపీడీఓ

న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

సమస్య: వరదయ్యపాళెం పంచాయతీ గోవర్ధనపురంలోని వంతెన శిథిలమైంది. ద్విచక్రవాహనాలు గుంతల్లోదిగి ప్రమాదాలకు గురవుతుండగా, ఇతర వాహనాల రాకపోకలకు ప్రత్యక్ష నరకాన్ని తలపిస్తోంది.
- కల్లూరు మల్లికార్జున్, గోవర్ధనపురం

సమాధానం: వంతెన, రహదారి మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే పనులు చేపడతాం.
- గిరీష్‌కుమార్, ఏఈ, ఆర్అండ్‌బీ

వర్షం వస్తే.. తప్పవు పాట్లు



కొస్త వర్షం కురిస్తే ప్రయాణికులకు పాట్లు తప్పడంలేదు. మండలంలోని పెద్దకనపర్తి రహదారిపై వర్షపు నీరు చేరడంతో ఈపరిస్థితి నెలకొంటోంది. రోడ్డుకి ఇరువైపులా ఇటుక బట్టీల నిర్వహకులు ఎత్తుగా మట్టిని నిల్వచేసి ఉంచడంతో రోడ్డు లోతట్టుగా మారింది. దీంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక పోవడంతో అటువైపుగా రాకపోకలు సాగించే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నీరు నిల్వ చేరకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, తొట్టంబేడు

అటుఇటైతే జనం ప్రాణాలు గాలిలో



మండలంలోని శ్రీకాళహస్తి-పెద్దకనపర్తి ప్రధాన రోడ్డులోని ఇటుక బట్టీల సమీపంలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. ఇటుక బట్టీల నిర్వహకులు విద్యుత్తు స్తంభం అంచు వరకు మట్టిని తొలగించడంతో పడిపోయే స్థితికి చేరుకుంది. ఈ రహదారి మీదగా పలు గ్రామాల ప్రజలు వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్తు శాఖ అధికారులు పెను ప్రమాదం చోటు చేసుకోకముందే తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, తొట్టంబేడు

ఎండిన వృక్షం.. పడితే కష్టం



భరద్వాజతీర్థం వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు స్థానిక భక్తులతో సందడిగా ఉంటుంది. ఎక్కువ మంది పాదచారులు ఇక్కడ వాకింగ్ చేస్తుంటారు. భక్తులు ఇక్కడి అందాలను ఆస్వాదించేందుకు వెళ్తుంటారు. దీంతో ఎప్పుడూ సందడి వాతావరణం ఉంటుంది. అయితే ఇక్కడ ఏళ్ల క్రితం ఓ వృక్షం ఎండిపోయింది. ప్రస్తుతం పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ముందస్తుగా దాన్ని తొలగించకుంటే రానున్న వర్షాలకు ఈదురుగాలుల కారణంగా పడితే ప్రమాదాలు జరిగే అవకాశముంది. వాకింగ్ చేసే వాళ్లు కాస్తంత భయంతో చేయాల్సి వస్తోంది. దీన్ని తొలగించే విధంగా అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది.
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి


నదీ తీరాన్ని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కార్తికం.. సిద్ధమవుతున్న తీరం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తిలో పుణ్యస్నానాలు చేసేందుకు వస్తుంటారు. సువర్ణముఖి నదీ తీరంలో భక్తులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసేందుకు వీలుగా ఆలయ అధికారులు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నదీ తీర ప్రాంతంలో వ్యర్థాలను తొలగించడంతో పాటు పిచ్చిమొక్కలు, గడ్డిని తొలగించే పనుల్లో పారిశుద్ధ్య కార్మికులు నిమగ్నమయ్యారు. వ్యర్థాల తొలగింపుతో సువర్ణముఖీ తీరం సుందరంగా కన్పిస్తోంది.

ఘనంగా కార్తిక వన మహోత్సవాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: జిల్లా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో కార్తిక వన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షులు వెంకటమణిబాబు తెలిపారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆవరణలో ఆదివారం గౌడ సంఘ సభ్యులతో ఆయన సమావేశం అయ్యారు. వన మహోత్సవాలపై చర్చించడంతో పాటు దాన్ని విజయవంతం చేసే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులందరూ ఆయన్ను ఘనంగా సత్కరించారు. గతంలో ఉన్న సంఘాన్ని రద్దు చేసినట్లు స్థానిక సంఘం నేతలు జిల్లా అధ్యక్షుడికి విన్నవించారు. గౌడ సంక్షేమ సంఘం ప్రతినిధులు రమేష్ గౌడ్, దొరబాబు గౌడ్, భాస్కర్‌గౌడ్, మోహన్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటమణిబాబును సత్కరిస్తున్న స్థానిక సంఘం నేతలు


మాట్లాడుతున్న ఏఐఏకేఎస్ జాతీయ కార్యదర్శి సుందరరామరాజు

వేతన చట్టాలు అమలు చేయాలి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏపీసీడ్స్‌లో పని చేస్తున్న హమాలీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతన చట్టాన్ని అమలు చేయాలని ఏఐఏకేఎస్ జాతీయ కార్యదర్శి సుందరరామరాజు డిమాండ్ చేశారు. కార్పొరేషన్ ఆవరణలోని సమావేశపు హాలులో శనివారం హమాలీలతో పాటు సంఘం నేతలతో సమావేశం అయ్యారు. హమాలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడి కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు కార్పొరేషన్ పరంగా అందాల్సిన అన్ని సౌకర్యాలను అందించే విధంగా యాజమాన్యం శ్రద్ధ తీసుకోవాలని కోరారు. హమాలీలకు సంబంధించిన టెండర్లను ముఠా కార్మికులకు కాకుండా సీడ్స్ అధికారులు ఎంపిక చేయాలని కోరారు. సమావేశంలో టీయూసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, రామచంద్రయ్య, గౌరీ, గురవయ్య, హరిబాబు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల తొలగింపు

రేణిగుంట: స్థానిక మంచినీళ్లగుంత వద్ద చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని ఆదివారం ఈనాడులో 'మేమున్నాం మీకుతోడుగా'లో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు ఆదివారం ఉదయం ఇక్కడ శుభ్రత చర్యలు చేపట్టారు.

మురుగు తొలగించారు

స్పందనకు వందనం

ఏర్పేడు: మండలంలోని ఆమందూరు పంచాయతీలో మురుగు కాలువలను పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. మురుగునీరు వీధుల మీద ప్రవహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈనాడులో ఇటీవల 'మేమున్నాం-మీకు తోడుగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆదివారం మురుగు కాలువలు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు.


సచివాలయం-3 వద్ద ఉంచిన బుట్టలు

పంపిణీ కానీ చెత్త బుట్టలు

రేణిగుంట, న్యూస్‌టుడే: ఇంటింటికీ చెత్త సేకరణ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేయాల్సిన చెత్త బుట్టలను కొన్ని నెలలుగా పంపిణీ చేయకుండా వదిలేశారు. రేణిగుంటలోని పంచాయతీ కార్యాలయం, సచివాలయం-3లో ఈ బుట్టలను మూలన పడేశారు. కనీసం ఇంటింటికీ అందిస్తే కాస్త బాగుంటుందనే ఆలోచన పంచాయతీ పెద్దలకు, అధికారులకు లేక పోయింది. వెంటనే వీటిని పంపిణీ చేయాల్సిన అవసరం ఉంది.

అలరించిన పద్మావతీపరిణయం హరికథ

శ్రీసిటీ(వరదయ్యపాళెం),న్యూస్‌టుడే: శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్యవేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో తితిదేకు చెందిన ప్రముఖ హరికథా విద్వాంసుడు 'హరికథా ధురంధర' బిరుదాంకితుడు వై.వెంకటేశ్వర్లు భాగవతార్ శ్రీసిటీలో ఆలపించిన పద్మావతిపరిణయం హరికథాగానం ప్రేక్షకులను అలరించింది. శ్రీనివాసుడు, పద్మావతి దివ్యవివాహాన్ని వై.వెంకటేశ్వర్లు భాగవతార్ పాటలతో అద్భుతహావభావాలతో వివరిస్తూ, తిరుమల తిరుపతి ప్రాముఖ్యత, శ్రీనివాస అవతారం, పద్మావతిపై ఆయనకు గల అపూర్వకలయిక, ప్రేమను కళ్లకు కట్టినట్లు వర్ణించారు. ఆయనకు తోడుగా నిష్ణాతులైన సంగీత విద్వాంసులు, కళాకారులు రెడ్డిశంకర్, ఎస్.మురళి, జీ.శ్రీనివాసులు, విజయచంద్రలను ఈ సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. శ్రీసిటీ పీఆర్వో పల్లేటి బాలాజీ, శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


హరికథ కళాకారులతో శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి

యువకులపై దాడి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పెళ్లకూరు మండలం ఆర్లపాడుకు చెందిన ఇద్దరు యువకులపై గుర్తుతెలియని నలుగురు యువకులు దాడి చేయడంపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అన్న వరుస అయిన తేజాను శ్రీకాళహస్తి రైల్వేస్టేషన్‌లో వదిలిపెట్టేందుకు తరుణ్ శనివారం అర్ధరాత్రి ఆటోలో ఆర్లపాడు నుంచి ఇక్కడకు బయలుదేరారు. మార్గమధ్యలో ఆటో వేగంగా నడపుతున్నారంటూ నలుగురు యువకులకు, తరుణ్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. చినికి చినికి గాలివానగా మారడంతో నలుగురు యువకులు తేజ, తరుణ్‌పై దాడి చేయడం వాళ్ల చరవాణులు తీసుకెళ్లడంపై బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.



మేటలతో ఇబ్బందులు

వర్షం రైతులకు ప్రయోజనమైనా కొంత మందికి ఇబ్బందులు తప్పలేదు. ఊరందూరుకు వెళ్లే మార్గంలో రోడ్డును ఆనుకుని పొలాల్లోని రైతులకు ఈ పరిస్థితి తలెత్తింది. వర్షం కారణంగా అక్కడున్న వాగుల్లో ప్రవాహం మరింత పెరిగింది. అయితే రోడ్డు నిర్మాణానికి రోడ్డు పక్కన వేసిన కంకరంతా అక్కడున్న పొలాల్లోకి కొట్టుకెళ్లింది. అలాగే ఇసుక మేటలు వేయడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ విషయమై బాధిత రైతులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.
- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

వాయిదాలకు హాజరు కాకపోవడంతో రిమాండ్

రేణిగుంట, న్యూస్‌టుడే: హత్యాయత్నం కేసులో కోర్టు వాయిదాలకు హాజరుకాక పోవడంతో ముద్దాయిని న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించినట్లు రేణిగుంట పట్టణ పోలీసు స్టేషన్ రైటర్ కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తారకరామానగర్‌కు చెందిన పార్థసారథి అలియాస్ సారథిపై హత్యాయత్నం కేసు నమోదైంది. గత అరు నెలలుగా కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతుంటే తిరుపతి ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి అరెస్టు వారెంట్ జారీ చేశారు. దీంతో సీఐ శరత్‌చంద్ర ఉత్తర్వుల మేరకు రేణిగుంట పట్టణ పోలీసులు సారథిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

ఏర్పేడు, న్యూస్‌టుడే: భవనంపై నుంచి కిందపడి కార్మికుడు మృతిచెందిన ఘటన ఏర్పేడు మండలంలోని ఐఐటీకి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఐఐటీకి సమీపంలో హర్షవర్ధన్‌రెడ్డి నిర్మిస్తున్న ఆరో అంతస్తులో ఆదివారం సెంట్రింగ్ పనిచేస్తున్న గుంటూరు జిల్లా వినుకొండ మండలం ఉమ్మడివరానికి చెందిన మణికంఠ(29) అదుపుతప్పి కిందపడ్డాడు. తోటి కార్మికులు గుర్తించి వైద్యం నిమిత్తం రుయాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. ఐదేళ్లుగా మణికంఠ తిరుచానూరు సమీపంలో నివసిస్తూ రోజువారీ కూలీగా జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: మద్యానికి డబ్బు ఇవ్వలేదనే మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నెలటూరులో చోటు చేసుకుంది. ఎస్సై మల్లికార్జున్ కథనం మేరకు.. మండలంలోని నెలటూరుకు చెందిన గురవయ్య(41) మద్యానికి బానిసైయ్యాడు. ఈనెల 8వ తేదీన భార్యను మద్యానికి డబ్బు ఇవ్వాలని గొడవ పడటంతో భార్య నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఇంట్లోని పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలోని గురవయ్యను హుటాహుటిన తిరుపతి రుయా ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆగని అక్రమ నిర్మాణం

ఏర్పేడు, న్యూస్‌టుడే: మండలంలోని గుండ్లకండ్రిగలో గుంత పొరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ ప్రయోజనాలకు కేటాయించిన స్థలాన్ని స్థానికులు కొందరు ఆక్రమించుకుని యథేచ్ఛగా అమ్మకాలు చేపట్టడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోని అక్రమార్కులు వేగంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ భార్గవిని వివరణ కోరగా ఇప్పటికే నిర్మాణాలు అడ్డుకున్నాం. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


కుంట పొరంబోకు స్థలంలో నిర్మిస్తున్న భవనం

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై గ్రామస్థుల దాడి

నారాయణవనం, న్యూస్‌టుడే: అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిపై గ్రామస్థులు దాడి చేసిన సంఘటన నారాయణవనం మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు.. కాకినాడకు చెందిన బాలు శనివారం రాత్రి మండలంలోని వీకేపాలెం గ్రామంలో అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో స్థానికులు దొంగ అనే అనుమానంతో అతన్ని పట్టుకొని కొట్టి పోలీసులకు అప్పగించారు. అలాగే వేలూరు గ్రామానికి చెందిన రవీంద్రనాథ్ చెరుకు తోటలో పనిచేయడానికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండగా పోలీసులకు అప్పజెప్పారు. ఇతనికి మానసిక స్థితి సరిగ్గా లేక నాలుగు రోజులు ముందు ఇంటి నుంచి వచ్చినట్లు అతని బంధువులు తెలిపారని పేర్కొన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారిని కట్టేసి కొట్టడం వంటి సంఘటనలో ఏదైనా జరిగితే దానికి ప్రజలే బాధ్యులు అవుతారని విన్నవించారు.


అనుమానాస్పదంగా తిరిగిన వ్యక్తులతో పోలీసులు

గూడూరు
•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 60 నుంచి రూ. 80 వరకు
రెండో రకం: కిలో రూ. 50 నుంచి రూ. 60 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్	140
లేయర్	115
బ్రాయిలర్స్	250
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	276
లేయర్ మాంసం	195

దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వం తరపున ఉచితంగా డీఎస్సీ శిక్షణ ఇస్తామని సహాయ సాంఘిక సంక్షేమ అధికారిణి లక్ష్మీరాజ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉత్తమనెల్లూరులో గ్రామోత్సవం

కోట, న్యూస్‌టుడే: కోట మండలం ఉత్తమనెల్లూరులో మట్టెలమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణలు చేసి వాహనంపై ఉంచి ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

వాకాడు(కోట), న్యూస్‌టుడే: మండలంలోని మొలగనూరులో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, తెదేపా నాయకులు నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, కోట, వాకాడు మండలాల తెదేపా అధ్యక్షులు మధురెడ్డి, సర్వోత్తమరెడ్డి, నాయకులు పాల్గొని పూజలు చేశారు.

'పల్లె పండుగ' నేడు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: మండలంలోని మినమనమూడి, శ్రీధనమల్లి, తొగరమూడి పంచాయతీల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో 'పల్లె పండుగ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు ఆదివారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సంతాపం

బాలాయపల్లి, న్యూస్‌టుడే: జైదరం పంచాయతీ మల్లెమాల గ్రామ తెదేపా సీనియర్ నేత, పెంచలకోన ఆలయ కమిటీ మాజీ సభ్యుడు సాగి నరసింహులు నాయుడి సతీమణి అనసూయమ్మ(65) ఆదివారం మృతి చెందారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తెదేపా నాయకులు మస్తాన్ నాయుడు, సింగంశెట్టి భాస్కరరావు, రాయి సత్యం, దాసరి రాజగోపాల్‌నాయుడు తదితరులు చేరుకుని ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తవ్వకాలకు అనుమతులొచ్చాయ్..!

☛ పెళ్లకూరు, కోట మండలాల్లో ఏర్పాట్లు ☛ 1.37 లక్షల టన్నులకు అవకాశం

గూడూరు, వెంకటగిరి, న్యూస్‌టుడే: స్వర్ణముఖి నది ప్రాంతంలో ఇసుక పూడిక తీయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా శాండ్ కమిటీ మూడు చోట్ల తవ్వకాలు చేపట్టడానికి అవకాశం ఉన్నట్లు గుర్తించింది. దీంతో ఇసుక రేవుల ప్రాంతంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇలా ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుక తరలిస్తారు. అక్కడ నుంచి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న వారికి ఇసుక అందజేస్తారు. అదే విధంగా ట్రాక్టర్లలో రేవుల నుంచి స్థానిక అవసరాలకు తీసుకెళ్లడానికి ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని కొత్త జీవోలో పేర్కొన్నారు.

గూడూరు ఇరిగేషన్ డివిజన్ పరిధిలోని 3 చోట్ల 1.37 లక్ష టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతి వచ్చింది. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో ఇసుక అందుబాటులోకి రానుంది. వాస్తవానికి ఉచిత విధానం అమల్లోకి వచ్చిన తర్వాత కొందరు ఇసుక కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీంతో ధరలు పెరిగిపోయాయి. ట్రక్కు ధర సాధారణంగా రూ.2,500లకు కాగా దళారీల పుణ్యమా అని రూ.4 వేలకు పెరిగింది. ఇసుక అనుమతితో ఇవన్నీ కట్టడి కానున్నాయి.


ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్

స్వర్ణముఖిలో పూడికతీత ఇలా

ప్రాంతం	విస్తీర్ణం (హెక్టార్లు)	తవ్వకాలు (టన్నులు)
పుల్లూరు	1.92	43,173
కలవకూరు	1.81	40,963
గూడలి	2.30	53,550

పెళ్లకూరు మండలంలో..

పెళ్లకూరు మండలం పుల్లూరు వద్ద పాలచ్చూరు ఆనకట్ట ఎగువ ప్రాంతంలో 28,728 క్యూబిక్ మీటర్ల మేర తవ్వకాలు చేపట్టనున్నారు. ఇదే ప్రాంతంలో దిగువ కలవకూరు వద్ద మరో 27,308 క్యూబిక్ మీటర్లు తవ్వనున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో ఉన్న ఇసుకను అక్రమార్కులు కరిగించేశారు. దీంతో ఉన్న ఇసుక ఏ మేరకు రక్షిస్తారో అధికారులు తెలపాల్సి ఉంది.

కలవకూరులో రైతుల అభ్యంతరం

దిగువ కలవకూరు ప్రాంతాల్లో ఇసుక నిల్వలు తగ్గిపోయాయి. ఇప్పటికే ఇక్కడ ఉన్న రైతుల ఫిల్టర్ పాయింట్లు బయట పడ్డాయి. ఇక్కడ ఇసుక నిల్వలు 10-15 అడుగుల మేర ఉంది. వీటిని తొలగిస్తే నీరువచ్చే పరిస్థితి లేదని రైతులు పేర్కొంటున్నారు. ఆనకట్ట వద్ద అభ్యంతరం లేదని చెబుతున్న రైతులు దిగువ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టరాదని కోరుతున్నారు.

రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

కోట మండలం గూడలి స్వర్ణముఖి బ్యారేజ్ సమీపంలో 35,700 క్యూబిక్ మీటర్లు తీసుకోవడానికి అనుమతి ఉంది. గతంలో విచ్చలవిడిగా తవ్వకాలు చేపట్టారు. తవ్వకాలకు అనుమతి రావడంతో స్టాక్ పాయింట్ల నిల్వలు పెరిగే అవకాశం ఉంది. రెండు, మూడు రోజుల్లో తవ్వకాలు ప్రారంభిస్తాం. - ద్వారకానాథ్‌రెడ్డి, తహసీల్దార్


రోడ్డు శంకుస్థాపనలో శివకుమార్

సీసీరోడ్లకు రూ.1.70 కోట్లు

పెళ్లకూరు, న్యూస్‌టుడే: పెళ్లకూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.70 కోట్ల నిధులు మంజూరైనట్లు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కందమూరి శివకుమార్ తెలిపారు. జీంపాటూరులో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శి శాంతి పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట జనరల్ పాఠశాల్లో ఆదివారం చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి అరవింద నేత్రాలయ వైద్యులు లహరి సిబ్బంది 190 మంది రోగులకు పరీక్షలు చేసి మందులు, 32 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 15 మందికి శస్త్రచికిత్సలకు ఆసుపత్రికి తరలించారు.

60 మందికి సేవలు

చిల్లకూరు, న్యూస్‌టుడే: గుమ్మళ్లదిబ్బలో జిందాల్ థర్మల్ విద్యుత్తు కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. పాల జిందాల్ జన్మదినం సందర్భంగా సుమారు 60 మంది గ్రామస్థులకు వైద్యసేవలను అందించి మందులను పంపిణీ చేశారు. పరిశ్రమ ప్రతినిధులు శివారెడ్డి, దిలీప్ పాలాక్ తదితరులు పాల్గొన్నారు.



కుంగిన చెరువు కట్ట

వరద పనుల్లో నాణ్యత డొల్లగా మారింది. గతేడాది మిగ్‌జాం తుపాన్‌తో వైకాపా నేతలకు దోచిపెట్టడానికి తెచ్చిన నిధుల వ్యయం ఇదే తీరుగా మారింది. చేసిన మూణ్నాళ్లకే పనుల డొల్ల బయట పడుతోంది. ఇదే క్రమంలో పెళ్లకూరు మండలం చిల్లకూరు పెదచెరువు కట్టకు రూ.50 లక్షలు మంజూరు కాగా ఇదే ప్రాంతానికి చెందిన నేత టెండర్లలో దక్కించుకుని పనులు చేయించారు. ఇలా చేసిన పనులు కట్ట తొలచి చదును చేయించేశారు. పైన పలుచగా గ్రావెల్ పరిచి పని అయిందనిపించారు. ఈ కట్ట పటిష్ఠత తాజా వర్షాలకు బయట పడింది. ఇదే తీరుగా చాలా చోట్ల కట్ట బలహీన పడిందని రైతుల వాదనగా ఉంది. **- న్యూస్‌టుడే, పెళ్లకూరు**



ఆదమరిస్తే ప్రమాదమే

కోట మండలం గూడలి సమీపంలోని ర.భ రోడ్డు ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇక బస్సు సర్వీసులు, లారీలు కూడా ఎదురుగా వాహనాలను తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రతిపాదనలు పంపి మరమ్మతులు చేస్తామని ర.భ అధికారులు అంటున్నారు. **- న్యూస్‌టుడే, కోట**



పార్కింగ్ తిప్పలు

తడ రైల్వేస్టేషన్లో ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. భద్రత లేకపోవడంతో తరచూ ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. బాధితులు ఫిర్యాదు చేసేందుకు జీఆర్‌పీ పోలీసులను సంప్రదిస్తే తమ పరిధి కాదని, ఆర్‌పీఎఫ్ తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారు. శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామిక వాడలు ఏర్పాటవడంతో నెల్లూరు, చెన్నై పరిసర ప్రాంతాల నుంచి తడకు రైలు మార్గం ద్వారా వచ్చే కార్మికులు, ఉద్యోగుల రాక పెరిగింది. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి ద్విచక్రవాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తడ**

అవీ.. ఇవీ.. అన్నీ..

పోషకాహార కిట్ల పంపిణీ.. నాయుడుపేట పట్టణం: నాయుడుపేట అమ్మా ఫౌండేషన్ తరపున ఆదివారం 25 మంది చిన్నారులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు కృష్ణవేణి, రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి రామ్మోహన్, సభ్యులు ఎం.కృష్ణారావు, అశోక్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు.. చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలిసిన ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం తరలివచ్చారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. అమ్మవారు విశేష అలంకరణలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు.

తాళ్లమ్మ ఆలయంలో.. గూడూరు పట్టణం: పట్టణంలోని తాళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. చెన్నూరు-తిప్పవరపాడు గ్రామాల ఆరాధ్యదైవం కట్టాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నేత్రదానం.. సూళ్లూరుపేట: పట్టణంలోని గాండ్లవీధికి చెందిన కర్లపూడి సాత్విక్ దత్త(7) మరణానంతరం కుటుంబసభ్యుల కోరిక మేరకు స్థానిక ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ప్రతినిధులు ఆదివారం బాలుడి కార్నియాలు సేకరించి, చెన్నై శంకర నేత్రాలయానికి అందించారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ నేత్ర మహోద్యమంలో బాలుడు 444 నేత్రదాతగా నిలిచారు.

ఉద్యోగిపై దాడి దారుణం.. వెంకటగిరి: సచివాలయ ఉద్యోగిపై కౌన్సిలర్ దాడి చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చెంగయ్య, అరవ మంజుల ఖండించారు. ఆదివారం కమిటీ సమావేశం నిర్వహించారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనాలు

కోట, న్యూస్‌టుడే: ప్రకాశం కాలనీలో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ క్రమంలో వాహన చోదకుల పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 7 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇరువురి ఘర్షణ

కోట: ఉత్తమనెల్లూరులో ప్రసాద్ అనే వ్యక్తిపై హేమంత్ కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం జరిగింది. గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇరువురు మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ప్రసాద్ గాయపడ్డారు. విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ.. ప్రత్యక్షం

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీహరికోట రోడ్డులో శనివారం రాత్రి ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. అయితే సదరు వాహనం ఆదివారం తడ మండల పరిధిలో ఉండటాన్ని గుర్తించారు. వివరాల్లోకెళ్తే.. శ్రీహరికోట రోడ్డులో శ్యామ్ అనే యువకుడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి దుకాణం ముందు ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. సీసీ ఫుటేజీలు పరిశీలిస్తే.. ఇద్దరు యువకులు వాహనాన్ని అపహరించినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం తడ మండలంలోని కొండూరు వద్ద స్థిరాస్తి క్షేత్రంలో ద్విచక్రవాహనం ఉన్నట్లు స్థానికులు తెలిపారు. వాహన యజమాని వెళ్లి వాహనాన్ని తీసుకున్నారు. పట్టణంలో పోలీసులు రేయింబవళ్లు గస్తీ తిరుగుతున్నామని ఆర్భాటంగా చెబుతున్నా.. తరచూ ద్విచక్రవాహనాలు చోరీకి గురవుతూనే ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

మోటారు సైకిల్ చోరీ

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: నాయుడుపేట లోతువానిగుంట వద్ద పార్శిల్ సర్వీసు కార్యాలయం వద్ద శనివారం రాత్రి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడు విధులు ముగించుకుని ఆదివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి వాహనం అదృశ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడిపై కత్తితో దాడి

పెళ్లకూరు: పెళ్లకూరు మండలం పుల్లూరులో వినయ్‌కుమార్‌పై అదే గ్రామానికి చెందిన నారాయణ, నాగయ్యలు కత్తితో దాడి చేసిన గాయపరిచారు. గ్రామానికి చెందిన నారాయణ తరచూ స్థానికులతో గొడవ పడేవారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వినయ్‌కుమార్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అతడితో పాటు నాగయ్య కూడా గ్రామంలో కత్తితో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెన్నూరులో.. గూడూరు పట్టణం: గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు వద్ద బహిర్భూమికి వెళ్లిన ఓ యువకుడిపై అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామీణ సీఐ కిషోర్‌బాబు వివరాల మేరకు.. చెన్నూరు అరుంధతిపాలెం చెందిన వంశీ సమీపంలోని ఖాళీ స్థలంలో బహిర్భూమికి వెళ్లారు. గోవింద రాజా అనే వ్యక్తి వంశీని డబ్బులు, ద్విచక్ర వాహనాన్ని ఇవ్వమని అడగ్గా అందుకు నిరాకరించాడు. ఆగ్రహించిన రాజా కత్తితో వంశీపై దాడి చేశాడు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

దొరవారిసత్రం, న్యూస్‌టుడే

సమస్య: తుంగమడుగు పంచాయతీ పరిధిలో సాగు నీటి చెరువులను కొందరు ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. ఆయకట్టు రైతులు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.
- నారాయణరెడ్డి, స్థానిక రైతు

సమాధానం: చెరువుల ఆక్రమణ విషయమై పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి ఆక్రమణలు గుర్తిస్తాం. చర్యలు చేసుకుంటాం.
- శైలకుమారి, తహసీల్దారు, దొరవారిసత్రం

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని సాధుపేట ప్రాంతంలో వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లు అలుముకున్నాయి. పాదచారులు, వాహనదారులు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.
- సుభాన్, గూడూరు

సమాధానం: సిబ్బంది ద్వారా వీధిదీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

వెంకటగిరి, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని 16వ వార్డు కర్ణకమ్మ వీధిలో పాఠశాల వెనుక భాగంలో గుంట చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి గుంటలో మురుగునీరు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. **- బాబీ, వెంకటగిరి**

సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. గుంటను మట్టితో పూడ్చి ఇబ్బంది లేకుండా చూస్తాం.
- రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వెంకటగిరి

పట్టణ వీధులు జలమయం

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు వీధులు శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి జలమయం అయ్యాయి. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ నివాసానికి రాకపోకలు సాగించే వీధి పొడవునా వర్షపునీరు నిలిచింది. రాకపోకలకు అంతరాయంగా మారింది. ఈ రోడ్డు సరిగా లేక, కాలువలు బాగలేక మురుగు, వర్షపునీరు నిలుస్తోంది. ఈ మార్గంలో తిరిగే ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా రోడ్డు మరమ్మతు గురించి పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.


అమరా గార్డెన్ వద్ద వీధిలో వర్షపు నీటి నిల్వ


జూనియర్ కళాశాల వద్ద నిలిచిన నీరు